
# కుసంస్కారం

-యల్లాప్రగడ సువర్చలాదేవి

"రేపు మేము వ్రతం చేసుకుంటున్నాం. మీరు తప్పక రావాలి" తల్లి చెబుతున్న విషయాన్ని చిరాగ్గా వింది పద్దెనిదేళ్ల రూప. 'ఈ పేరంటాలు, నగల ప్రదర్శనలు ఎంత బోర్? ఈ మమ్మీకి ఇదేం హాబీనో..అందరూ అనుకునేటట్లు ఆడవాళ్లంటే ఎప్పుడూ ఇవేనా? వెళ్లేది తానొక్కతే వెళ్లక మధ్యలో నన్నెందుకు లాగడం? ప్రతిసారీ ఆ పద్మాంటీ ఉండేది. ఇప్పుడు ఆమె వూరికెళ్లడంతో నాకు తప్పలేదు ఈ బోర్ ప్రోగ్రాం' అనుకుంటోంది.

"ఏమే అందరిళ్లా అయిపోయినట్లేనా?" తల్లి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిన రూప "ఆ అయినట్టే" అంది ఇప్పటికైనా ఇంటికి వెళ్లిపోవచ్చులే అనుకుని. లిఫ్ట్‌లో తన ఫ్లాట్‌కి వెళుతుంటే గుర్తుకొచ్చింది 606 ఆంటీని పిలువలేదని. కానీ ఆమెని ఎప్పుడూ ఇలాంటి పార్టీలలో చూసినట్లు



గుర్తులేదు. అదే విషయాన్ని తల్లిని అడిగింది.

"తనా... తనెప్పుడు రావాలి? ఆవిడదంతా అదో టైపులే" తల్లి గొంతులోని వెటకారం ఆ అమ్మాయికి అర్థం కాలేదు.

"ఏం...ఎందుకు రాదు?" పట్టువదలని విక్రమార్కుడి చెల్లెలిలా సంగతి లాగాలని చూసినా తల్లి నుండి ఏదో నిరసనలు, ఆమె గొణుగుడు తప్ప ఏం అర్థంకాలేదు.


★★★



## కృంగిన భూమి

ఆ మధ్య ఘటమాలా సిటీలో తీవ్రమైన వర్షాలు కురిసినప్పుడు నగరం నడుమ 200 అడుగుల లోతుకి ఒక్కసారిగా భూమి కృంగి పెద్ద సొరంగం ఏర్పడితే పైనున్న మూడంతస్తుల భవంతి యధాతథంగా దిగబడిపోయిందిట. ఆ సమయంలో ఆ బిల్డింగులో ఉన్నవారెవరయినా బ్రతికివున్నారో లేదో ఇంతవరకూ తెలియలేదుట!

-తటవర్తి




ఆ రోజు ఆదివారం పదిగంటలు.

"అన్ని ఫ్లాట్స్‌వారు వచ్చినట్టేనా? మీటింగ్ మొదలుపెడదామా?" అడిగారు ఆ అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్నాథంగారు.

ఇంతలో అందరి దృష్టి ఆ మీటింగ్ హాలు డోర్‌వైపు తిరిగాయి. అక్కడ గుమ్మంలో 606 ఫ్లాట్ ఆవిడ.

అంతా మొహామొహాలు చూసుకున్నారు. ఎందుకంటే ఆ మీటింగ్‌లో వున్నవాళ్లంతా అన్ని ఫ్లాట్స్‌లో ఉండే మగవాళ్లే ఒక్క రంజనిగారు తప్ప. ఆమెకి భర్తపోయి చాలాకాలమైంది. కానీ ఏవో సోషల్ సర్వీస్ యాక్టివిటీస్‌లో బిజీగా ఉంటారు. ఈ అసోసియేషన్ కార్యకలాపాల్లో కూడా ఆమెది యాక్టివ్ రోలే.

ఆమెతోసహా అంతా ఆశ్చర్యం నుండి తేరుకోకముందే 606 ఫ్లాట్ ఆవిడ వచ్చి "మేము 606 ఫ్లాట్‌లో ఉంటామండీ. ఈ రోజు మా ఫ్లాట్ ఓనర్‌గారు ఏదో పని వుందని రాలేనని చెబితే ఆయన బదులు నేను వచ్చాను" అని కూర్చుంది.

"ఇంటి ఓనర్ రాలేకపోతే ఈమె ఇంటాయన రావచ్చుకదా. ఈ మీటింగ్‌కు ఆడవాళ్లు ఎందుకు? అయినా పేరంటాలకు పిలిస్తే రాదుట... పిలవని పేరంటానికి వచ్చినట్లు ఈ మీటింగ్‌కు ఎందుకో?"

"అవునండీ... నేనూ చాలాసార్లు చూసాను. మొగుడ్ని పక్కనబెట్టి ఈమే డ్రైవింగ్ చేస్తుంది. చూడబోతే పెత్తనం మొత్తం ఈమెదేలాగుంది"

"ఎంత పెత్తనం ఆమెదే అయినా అవన్నీ ఇంట్లోనే చూపెట్టాలిగానీ ఇలా మొగుడిని నలుగురిలో వెధవని చేసినట్లు ప్రతిదానికీ తగుదునమ్మా అని ఈమె వెళ్లాలా?"

ఇలా ఎవరిష్టం వచ్చినట్ల వాళ్లు మాట్లాడుకుంటున్నారు. వాళ్ల మాటలు ఆమెకీ వినబడినా విననట్లే వుంది.

"అన్నింటికీ తెగించినట్లే ఉంది. అందుకే అన్నీ విన్నా విననట్లు ఉంది" దానికీ ఆమెనే అంటున్నారు. మీటింగ్ అయి ఎవరి దారిన వాళ్లు వెళ్లారు. అందరితోపాటే 606 ఆవిడా వెళ్లింది.

అయితే చదువుకోవడానికి టెర్రస్ మీదకి వచ్చిన రూప కిటికీ పక్క నుండి జరిగిన ఈ తతంగమంతా గమనించింది.

ఏ ఓ నిశ్చయానికి వచ్చినదానిలా అక్కడినుండి 606 ఫ్లాట్‌వైపు అడుగులు వేసింది.

★★★

ఆ రోజు 105 ఫ్లాట్‌లోని పిల్లాడి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అపార్ట్‌మెంట్‌లోని దాదాపు అంతా అక్కడే ఉన్నారు ఒక్క 606 ఫ్లాట్‌లో వాళ్లు తప్ప.

"మీ రూప కనబడడంలేదేమండీ" ఎవరో అడిగారు సునందని.

"ఆ వస్తోందండీ... ఈ కాలపు ఆడపిల్లలు ఓ పట్టాన తయారవుకదా" ప్లాస్టిక్ నవ్వును ముఖానికి అతికించుకుని మరీ చెప్పింది సునంద.

అక్కడంతా అలాగే వుంది మరి. ఖరీదైన బట్టలు, నగలు,గిఫ్టులు ... పుట్టినరోజు అనేది ఒక వంక మాత్రమే. ఇతరులకి తమ గొప్పలు చూపించుకోవాలనుకునేవారు, ఈ సోషల్ గేదరింగ్స్‌లో తమ స్వప్రయోజనాలకి ఎవరిని పట్టుకోవాలా అని ఆలోచించేవాళ్లు... ఇలా అంతా తమ తమ స్వార్థాలతో అక్కడికి చేరినవారేగానీ ఇక్కడ ఎవరికీ ఎవరిమీద ప్రేమలు, అభిమానాలు ఉండవనేది సత్యం.

అన్నీ కృత్రిమ పలకరింపులు, పైపై మాటలు, మనసొక చోట, మాటొక చోట అన్నట్లుండే ప్రవర్తనలు. ఇక వాళ్లకి అక్కడలేని వారి గురించి పట్టించు

కునే తీరిక ఎక్కడుంటుంది?

సీరియస్‌గా ఆ ఫ్లాట్‌లోకి అడుగుపెట్టిన రూపని చూస్తూ "ఏంటే ఇంత లేటు? పైగా ఆ సీరియస్ మొహం దేనికి? కాస్త నవ్వితే నీ సొమ్మేం పోదులే" అంటూనే ఎవరి దగ్గరికో తీసుకువెళ్ళి "సరోజగారూ! నేను చెప్పాను కదా మా డాటర్ రూప" అంటూ ఆమెకి పరిచయం చేసింది రూపని. అన్యమనస్కంగానే పలకరించింది రూప.

ఎవరి బాతాఖానీలో వారున్నారు.రూపకు విసుగ్గా ఉంది. ఇక వెళ్ళిపోదామనుకొంటున్నంతలో 606 ఫ్లాట్ ఆవిడ గురించి ఏవో మాటలు వినబడ్డాయి.

"అబ్బో... ఏం బడాయిలే. మొగుడిని దేంట్లోనూ కల్పించుకోనివ్వదు. ఇంట్లో పని, బయటా పని అంతా ఆమెదే. మనం పేరంటాలకి పిలిస్తే రాదు గానీ మొన్న అపార్ట్‌మెంట్ మీటింగ్‌కు మాత్రం మగవాళ్లందరి మధ్యా తగుదునమ్మా అని ఆమె వెళ్లిందిట" ఇలా ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుకున్నారు. కేవలం హౌస్‌వైఫ్‌లేకాదు, చదువుకుని ఉద్యోగాలు చేసే ఆడవాళ్లు, ఆఖరికి మగవాళ్లు మాట్లాడుతూ ఉండేసరికి ఇక ఆగలేక దాదాపు అరిచినట్లుగా అంది "స్టాపిట్" అని. అంతా ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు.

"ఇక ఆపుతారా మీ నిందలు? పాపం ఆమె ఏం చేసిందని ఆమె గురించి ఇలా నెగటివ్‌గా మాట్లాడుతున్నారు? అసలు మీకు ఆమె గురించి ఏం తెలుసని మాట్లాడుతున్నారు. ఆమె మిమ్మల్ని ఏమైనా అవమానించి మాట్లాడిందా? మీకెవరికైనా తెలిసిగానీ తెలియకగానీ ఏదైనా అపకారం చేసిందా? అసలు మీ ప్రాబ్లెం ఏమిటి? ఆమె మీరు చేసే పేరంటాలకు రాలేదనేగా? ఎందుకు రాలేదు? అసలు ఆమెకు ఏమైనా సమస్యలున్నాయా అని మీలో ఒక్కరైనా ఆలోచించారా? ఇంట్లో పనులు, బయట పనులు అన్నీ ఆమే ఎందుకు చేస్తోందో తెలుసుకోవాలని మీరెవరైనా ప్రయత్నించారా? ప్రతిసారీ ఆమె భర్తకి బదులు ఆమే ఎందుకు కారు డ్రైవ్ చేయాల్సి వచ్చిందో మీరెప్పుడైనా ఆలోచించారా?" ఆమె ఆవేశం చూసి అందరికీ నోట మాట రాలేదు.

అందరిలో పెద్దవాడైన గుర్నాధంగారే ముందు తేరుకుని "ఏంటమ్మా? ఏదైనా సమస్యా?" అంటూ కాస్త అనునయంగా అడగడంతో శాంతించిన రూప మళ్లీ మాట్లాడ్డం మొదలుపెట్టింది.

"అందరూ ఆమెను 606 ఆవిడ అనే అంటాం. కానీ ఆమెకో పేరుందని కూడా ఆలోచించం. ఆమె పేరు సీతామహాలక్ష్మి. చక్కని పేరు. అంతకన్నా చక్కని రూపం. బహుశా అదే మీలో అసూయని కలిగించి వుంటుంది. నిజంగానే ఆ సీతా మహాసాధ్వికి వచ్చినట్లే ఈమెకీ కష్టాలొచ్చాయి. మీరందరూ అనుకుంటున్నట్లు ఆమె అన్ని బాధ్యతలు తన గొప్ప కోసమో, అధికారం కోసమో తీసుకోలేదు. తీసుకోవాల్సిన పరిస్థితులు వచ్చి తీసుకుంది. మీరు అనుకున్నట్లు ఆమె భర్త సాధారణమైన స్థితిలో లేరు. పక్షవాతం వచ్చి ఆయన కాలు సరిగా పని చేయదు. ఆయన ట్రీట్‌మెంట్‌కి ఈ దగ్గర్లో మంచి హాస్పిటల్ ఉందని, ఫిజియోథెరపీ కోసం ఆమె ఇక్కడ అద్దెకు తీసుకున్నారు. ఆయన బ్రెయిన్‌కి కూడా డ్యామేజీ జరగడంతో ప్రస్తుతం జాబ్ చేసే పరిస్థితిలో లేరు. అందుకే ఆమె జాబ్ చేస్తున్నారు. ఆమె ప్రతిరోజా సాయంత్రం తన భర్తను తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తోంది. అందుకే ఆమె ఎప్పుడూ సాయంత్రాలు ఇంట్లో ఉండదు. ఇవన్నీ ఆ ఫ్లాట్ ఓనర్‌గారికి తెలిసే అద్దెకు ఇచ్చారు. సోషల్‌గా మూవ్ అవడం అంటే పార్టీలు, అవకాశవాదులు స్వార్థ ఆలోచనలతో నిండి ఉండడం కాదు, నలుగురి గురించి మంచిగా ఆలోచించడం, నలుగురికి మనకు చేతనైనది చేయడం, వీలైతే అవతలివారి గురించి మంచిగా మాట్లాడుకోవాలిగానీ వారి గురించి చెడుగా మాట్లాడుకోవడంలోనే మనకు ఆనందం ఉంది అన్నట్లు మనం ప్రవర్తిస్తున్నామంటే మనం ఎంత దిగజారిపోయామో ఆలోచించుకోండి" అంటూ అక్కడి నుండి వెళ్లిపోయింది రూప.

చిన్నపిల్లయినా ఆ అమ్మాయిలో వున్న విచక్షణ, సహృదయం తమలో లేని ఆ పెద్ద తలలన్నీ తమ కుసంస్కారానికి అవమానభారంతో వాలిపోయాయి.

★



## రోబో పురోహితుడు

టోక్యోలో ఇటీవల ఒక రోబో పురోహితుడు ఒక యువజంట చేత ప్రమాణాలు చేయించి వాళ్ళ పెళ్ళి చేయించాడు.

## 9 అడుగుల కొవ్వొత్తి

బెంగుళూరుకి చెందిన సాయిరాం క్యాండిల్స్ సంస్థ గత ఐదేళ్ళుగా కొవ్వొత్తులు తయారుచేస్తోంది. ఆ సంస్థ ఇటీవల ఆరురోజులపాటు ముగ్గురు కార్మికుల చేత 250 కిలోల బరువున్న 9 అడుగుల పొడవైన కొవ్వొత్తిని తయారుచేయించింది. దీన్ని ఒకసారి వెలిగిస్తే నిరాటంకంగా 960 గంటలపాటు వెలుగుతుందని అంచనా. ఏనాటికయినా అతిపొడవైన కొవ్వొత్తిని తయారుచేయించి గిన్నెస్‌బుక్‌లోకి ఎక్కాలని తమ ఉద్దేశ్యంగా చెప్పారు సంస్థ సంచాలకులు.

-తటవర్తి

